చిలకలగూడ దోభీఘాట్‌లో నిర్మించిన డబుల్‌బెడ్రూంలు



గృహ ప్రవేశం ఎప్పుడో..?

- దూద్‌బావి ప్రాంతంలో 207 డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణం
- మూడేళ్ల కిత్రం ప్రారంభోత్సవం
- నేటికి లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించని వైనం
- తాజాగా స్పందించిన హైకోర్టు
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం

సికింద్రాబాద్: 'దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదు' అన్నట్లు ఉంది. మెట్టుగూడ డివిజన్ దోభీఘాట్ డబుల్ బెడ్రూం లబ్ధిదారుల పరిస్థితి. గృహసముదాయం నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం చేసి మూడేళ్లు గడిచినా సాంకేతిక కారణంగా లబ్ధిదారులకు ఫ్లాట్లు కేటాయించకపోవడంతో వృథాగా ఉంటున్నాయి. దీంతో రజకుల సొంతింటి కల కలగానే మిగిలుతున్నది. సాంకేతిక సమస్యలకు పరిష్కారం లభించకపోవడం, అధికారులు, పాలకులు కూడా దృష్టి పెట్టకపోవడంతో భారీ వ్యయంతో చేపట్టిన గృహసముదాయం పాడైపోతున్నాయి. అయితే తాజాగా శుక్రవారం హైకోర్టు ఈ విషయమై స్పందించింది. నిరుపయోగంగా ఉంటున్న డబుల్‌బెడ్రూం ఇండ్లను తక్షణమే లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

రూ. 17 కోట్లతో 207 గృహాల నిర్మాణం..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015 అక్టోబర్ 15న దూద్‌బావి ప్రాంతంలో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి శుకుస్థాపన చేసింది. సుమారు రూ.17 కోట్ల వ్యయంతో 207 డబుల్‌బెడ్రూం గృహాలతో పాటు గ్రౌండ్‌ఫ్లోర్‌లో వ్యాపార సముదాయాలను గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్మించారు. ఐదేళ్ల అనంతరం పనులు పూర్తికాగా 2021 జూలై 8న గృహనిర్మాణ సముదాయానికి ప్రారంభోత్సవం చేశారు. అయితే లబ్ధిదారులకు గృహాలు అప్పగించే విషయం**లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. కేటాయింపు నిబంధనలకు లోబడి లబ్ధిదారుల ధ్రువీకరణలు సరిగా లేవన్న సాకుతో అధికారులు** మోకాలు అడ్డుపెట్టడంతో సమస్య మొదటికి రాగా, డబుల్‌బెడ్రూంలు నిరుపయోగంగా ఉంటున్నాయి.

కోర్టును ఆశ్రయించిన బీజేపీ నాయకులు..

భారీ వ్యయంతో నిర్మించిన గృహనిర్మాణ సముదాయం నిరుపయోగంగా ఉంటుండడంతో బీజేపీ నాయకులు స్పందించారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా స్పందన కరువైంది. దీంతో నిరాశ చెందిన వారు అదే పార్టీకి చెందిన హైకోర్టు న్యాయవాది ఏఎస్.భాస్కరగిరి ద్వారా కోర్టును ఆశ్రయించారు. సాంకేతిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని చీఫ్ జస్టిస్‌ను కోరారు. ఇందుకు స్పందించిన హైకోర్టు గృహాల కేటాయింపు విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని లీగల్ సర్వీసెస్ ద్వారా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది.

నగరానికి ఆర్మీ సైకిల్ యాత్ర



టెరిటోరియల్ ఆర్మీ బృందంతో టాసా మేజర్ జనరల్ రాకేశ్ మనోచా

రసూల్‌పురా: టెరిటోరియల్ ఆర్మీ ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్మీ బృందం లడఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాంప్ నుంచి అండమాన్ నికోబార్ ఇందిరా పాయింట్ వరకు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం నగరంలోని తిరుమలగిరికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) మేజర్ జనరల్ రాకేశ్ మనోచా మాట్లాడుతూ జూలై 30న యాత్ర ప్రారంభమైందని ఇందులో ఇద్దరు అధికారులు, ముగ్గురు జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, టీఏ యూనిట్ల నుంచి 16 మంది ఇతర ర్యాంక్‌కు చెందిన మొత్తం 21 మంది సైక్లింగ్, సెయిలింగ్, స్కూబా డైవింగ్ చేస్తూ యాత్ర చేస్తున్నారని పేర్కొన్నారు. యువకులు, కళాశాల విద్యార్థులను కలుస్తూ దేశ భద్రతపై అవగాహన కల్పిస్తూ యాత్ర కొనసాగుతుందన్నారు. యాత్ర ముగింపు ఇందిరా పాయింట్ వద్ద జాతీయ జెండా, ఇండియన్ ఆర్మీ జెండా, టెరిటోరియల్ ఆర్మీ జెండాలను నీటి అడుగున ప్రదర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టెరిటోరియల్ ఆర్మీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ నేరం

లాలాపేట : మైనర్ డ్రైవింగ్ నేరమని బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల (మార్కెట్ స్కూల్)లో రోడ్డు భద్రతా నియమాలపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులు, వాహన యజమానికి జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. రూ 25 వేల జరిమానాతో పాటు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని విద్యార్థులకు సూచించారు. స్కూల్ హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, ట్రాఫిక్ అధికారి వెంకట ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐడీహెచ్ కాలనీలో వైద్య శిబిరం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ ఐడీహెచ్‌కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. శిబిరంలో సీతాఫల్‌మండి క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ సక్కు భాయి, డాక్టర్ ప్రశాంతి, స్థానికులు పాల్గొన్నారు.

నూతన గృహాల నిర్మాణానికి కృషి



కూరగాయల వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: గంగయ్య బస్తీలో శిథిలావస్థకు చేరిన వాంబే ఇండ్ల స్థానంలో నూతన గృహాల నిర్మాణానికి కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ అన్నారు. స్థానికులతో కలిసి గంగయ్య బస్తీలో శుక్రవారం పర్యటించారు. పాఠశాల సమీపంలో కొందరు గంజాయి సేవిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అలాగే మార్కెట్‌లోని కూరగాయల వ్యర్థాలను బస్తీలోని రోడ్లపై నాలాలో పడేస్తున్నారని దీంతో సాఫీగా వెళ్లలేక బస్తీల్లోకి వస్తున్నదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆయన నాలాలో వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని బోర్డు శానిటేషన్ అధికారులను ఫోన్లో ఆదేశించారు. అనంతరం ఎస్పీ కాలనీలో పర్యటించారు. స్థానిక సంక్షేమసంఘ నాయకులతో సమావేశమై కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జులైస్, సాయి కుమార్, శ్రీను, సుధీర్‌కుమార్, సునీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారాల నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : మహిళలపై అత్యాచారాలు, దాడులను నిరోధించేందుకు పోలీసులు మరింత పకడ్బందీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. జైనూరు ఘటనలో గాయపడి గాంధీఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని కమిషన్ ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని దవాఖాన సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం సమావేశంలో కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ నిందితుడికి కఠినశిక్ష పడేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, నీలాదేవి, జిల్లా శంకర్, రాంబాబునాయక్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, హైదరాబాద్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధి పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా వాహనాలకు పీయూసీ టెస్టింగ్

సనత్‌నగర్: 'క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్' అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న (నేడు) జీహెచ్‌ఎంసీ పరిధిలో వాహనాలకు ఉచితంగా పీయూసీ (పొల్యూషన్ అండర్ డ్రైవ్) టెస్టింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు టీజీపీసీబీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్బీనగర్ క్రాస్‌రోడ్డు, ఉప్పల్ భగాయత్, నాంపల్లి పోలీసు కంట్రోల్ రూం, ప్రసాద్ ఐ-మ్యాక్స్, దుర్గం చెరువు (కుమారి అంటీ ప్లేస్), మియాపూర్ మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో వాహన కాలుష్యంపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఘరానా నిందితుడి అరెస్టు

30 తులాల బంగారం స్వాధీనం

సికింద్రాబాద్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఇతనికి సహకరిస్తున్న మరొకరి కోసం గాలిస్తున్నారు. సికింద్రాబాద్ జీఆర్పీ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ ఎస్‌ఎన్ జావెద్, ఆర్‌పీఎస్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్లు బి.సాయిశ్వర్ గౌడ్, సరస్వత్ వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రం హన్సపట్టి ప్రాంతానికి చెందిన సుల్తాన్ (44), జోగిందర్ (35) వ్యవసాయ కూలీలు. పెద్దమొత్తంలో డబ్బు సంపాదించి విలాసాలు అనుభవించాలనే కోరికతో రైళ్లలో చోరీల బాటపట్టారు. ఆరేళ్లుగా వీరు రాయచూర్, కర్ణాటక బళ్లారి, సుల్తాన్ తదితర పీఎస్‌ల పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. వీరిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు కూడా తరలించారు. నిందితులు జైలు నుంచి వచ్చాక కూడా అదే వృత్తిని కొనసాగిస్తున్నారు. నగరంలోని నాగోల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎస్‌వీ. రవిశంకర్ తన కుమారుడి వివాహం కోసం విశాఖపట్నం వెళ్లి ఈ ఏడాది ఫిబ్రవరి 28న తిరిగి నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో బంధువులతో కలిసి సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. ఈ ప్రయాణంలో రవిశంకర్‌తోపాటు బంధువులు నిద్రలోకి జారుకోగా తన కోడలికి చెందిన 30 తులాల బంగారు నగలు ఉన్న సూట్‌కేసు చోరీకి గురైంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాక రవిశంకర్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్రాష్ట్ర నిందితులే చోరీకి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా హర్యానాకు వెళ్లి సుల్తాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 30 తులాల నగలను స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ మాజీద్, కానిస్టేబుళ్లు భవానీ శంకర్, మహిపాల్‌రెడ్డి, నాగుభాషాను రైల్వే సికింద్రాబాద్ ఎస్పీ చందనాదీప్తి అభినందించారు.

ప్రయాణికురాలి బంగారు గొలుసు అపహరణ

సికింద్రాబాద్: రైల్లో ప్రయాణిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణకు గురైన ఘటన సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లికి చెందిన భూపేంద్రసింగ్ వ్యాపారి. ఆయన భార్య రక్షరాజ్ పురోహిత్ సొంతూరుకు వెళ్లింది. ఈనెల 4న బోధ్పూర్ నుంచి సికింద్రాద్‌కు వచ్చేందుకు కాచిగూడ స్పెషల్ రైలు ఎక్కింది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె మెడలోని రెండున్న తు లాల బంగారు గొలుసును ఓ అగంతకుడు అపహరించుకుని రైలు నుంచి బయటకు దూకి పారిపోయాడు. బాధితురాలు వెంటనే 139 నంబర్‌కు ఫి ర్యాదు చేసింది. రైలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న తర్వాత ఇక్క డి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కోసం మహారాష్ట్ర నాందేడ్ పీఎస్‌కు బదలాయించారు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా ముఠా అరెస్టు

సికింద్రాబాద్: రైలు ప్రయాణికులను దోపిడీ చేస్తున్న అంతర్రాష్ట్ర ఏడుగురు మహిళా ముఠాను సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంజలి (28), డాలి (36), జయశ్రీ (30), సవితాబాయి (44), సునీత (39), పుత్తి లీబాయి (60), డొంగా (35) వృత్తిరీత్యా వీరంతా కూలీలుగా పనిచేసేవారు. వాటి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో ముఠాగా ఏర్పడ్డారు.రైళ్లలో ప్రయాణిస్తూ ప్రయాణికుల బ్యాగులు, జేబుల్లో నగదు, నగలను దొంగిలించడమే వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూలైలో మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వస్తున్న మహిఫాబాద్ వాస్తవ్యుడు రవీందర్ జేబులోంచి రూ.61వేలను దొంగిలించారు. బాధితుడు సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించారు. గురువారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో పోలీసులు నిర్వహించిన సాధారణ తనిఖీల్లో వీరు అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. వారిని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ10 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఐసెట్ కౌన్సెలింగ్ గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్షాల కారణంగా ఐసెట్-2024 మొదటి విడత కౌన్సెలింగ్‌ను మరో వారం రోజులు పొడిగించాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ రమేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులను కోరారు. భారీ వర్షాలకు రవాణా సౌకర్యాలతో పాటు విద్యుత్ అంతరాయంతో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయని, సర్వర్‌డౌన్ కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 11తో ముగియనున్న గడువును మరో వారం రోజుల పాటు పొడిగించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

రూ.15 కోట్ల రిలీఫ్ ఫండ్ విడుదల

సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వాటాదారులైన రైల్వే ఉద్యోగులకు సొసైటీ ప్రతినిధులు రూ.15 కోట్ల ప్లస్ రిలీఫ్ ఫండ్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ చిలుకు స్వామి మాట్లాడుతూ 5 వేల మంది వాటాదారులకు ఒక్కొక్కరికీ రూ.30 వేల చొప్పున ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. సొసైటీ వాటాదారులైన రైల్వే ఉద్యోగులకు రుణాలు, వాటాధనం, రిలీఫ్‌ఫండ్‌ను అందించడంలో ఇబ్బందులను తొలగించి సింగిల్ విండో పద్ధతిని ప్రవేశపెట్టామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కుమార్, అంజయ్య యాదవ్, మహేశ్‌కుమార్, రాజేందర్, కార్యదర్శి రవిశంకర్, ప్రతినిధులు శ్రీనివాస్, రాఘవేందర్, చక్రధర్ పాల్గొన్నారు.

ఆలయాలకు చెక్కుల పంపిణీ

రాంగోపాల్‌పేట్: రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ఆలయాలకు శుక్రవారం చెక్కులను అందించారు. ఆర్పీ రోడ్‌లోని మావురాల పెద్దమ్మ ఆలయం, చుట్టలబస్తీ గుండమ్మ, రంగ్రేజిబజార్‌లోని లలితాభవానీ, మోండాలోని కట్టమైసమ్మ, ముత్యాలమ్మ, జూలమ్మ, సజ్జన్‌లాల్ స్ట్రీట్‌లోని ఆలయాలకు గత బోనాల జాతర సందర్భంగా చెక్కులు మంజూరు కాలేదని, తానే చొరవ తీసుకోగా మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందని జై గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్.వట్టికూటి రామారావుగౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రానికి తొలిసారి గౌడ సామాజిక వర్గానికి చెందిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా నియమించడంపై రామారావుగౌడ్ బెంగళూర్‌లో ఏఐసీసీ అధ్యక్షుడుఎ మల్లికార్జున్ ఖర్గేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఖర్గేతో పాటు సోనియా, రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. వారి వెంట నాయకులు మధు, సత్యంగౌడ్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: మట్టి గణపతి విగ్రహాలను పూజించి జల వనరులను కాలుష్యం కాకుండా కాపాడుకుందామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద మట్టి గణపతి ప్రతిమలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బేగంపేట డీఎంసీ సమ్మయ్య, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషకుమారి, నాయకులు కూతురు నర్సింహ, బలరాం తదితరులు పాల్గొన్నారు.అలాగే సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, బేగంపేటలో కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

బడా గణేశ్ ఉత్సవాలకు రండి

లాలాపేట: ఖైరతాబాద్ బడా గణేశ్ ఉత్సవాలకు రావాలని కోరుతూ నిర్వాహకులు శుక్రవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు వీణా మాధురి, రాజేంద్రన్, రాణాప్రతాప్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

మూత్రశాలలు తొలగించండి

రాంగోపాల్‌పేట్: ప్రజలకు ఇబ్బందిగా ఉన్న మూత్రశాలలను వెంటనే తొలగించాలని టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. మహంకాళి ఆలయం పరిసరాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కడ ఉన్న మూత్రశాలల గురించి ఆమెకు ఫిర్యాదు చేశారు. వెంటనే తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆమె కోరారు. అనంతరం కొత్త ఎల్లయ్య పాఠశాలలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, శ్రీను పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కోట నీలిమా

ఓయూ పీఎస్ పరిధిలో 166 మండపాలు



రాజేందర్, ఓయూ ఇన్‌స్పెక్టర్

లాలా పేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో 166 మంది వినాయక మండపాల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయని ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండపాలన్నింటిని లొకేషన్‌తో జియో ట్యాగ్ చేస్తామని తెలిపారు. ప్రజలందరూ ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటలు దాటితే మైక్ సౌండ్ బంద్ చేయాలన్నారు. ఎలాంటి ఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే నిర్ణీత గడువులోగా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని కోరారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరం

సనత్‌నగర్: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు యువతను ఏకం చేసి ఎంతో పోరాడారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి మృతికి ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా

సనత్‌నగర్: గూడ్స్ స్టాండ్ కోసం అనుమతి కోరితే ట్రాలీ డ్రైవర్లతో దురుసుగా వ్యవహరించిన బేగంపేట ట్రాఫిక్ సీఐపై చర్యలు తీసుకోవాలని, స్టాండ్ ఏర్పాటుకు వెంటనే అనుమతి ఇవ్వాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎండీ కలీం, ముఖేశ్, అల్లబకాష్, రవి, మొయిన్, భిక్షపతి, నర్సింగ్, నాగరాజు, చారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీసులు సీఐటీయూ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వడ్డెర సంఘం నాయకుడి మృతి

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ వడ్డెర సంఘం నాయకుడు మక్కల అశోక్ మరణించారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య నలుగురు పిల్లలు ఉన్నారు. బీఆర్ ఎస్ లో క్రియాశీలకంగా ఉంటూ స్థానిక బస్తీ నాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నాడు. శుక్రవారం స్థానిక ఎ మ్మె ల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అశోక్ భౌతికకాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అశోక్ అంత్యక్రియలు చాచానెహ్రూనగర్‌లో నిర్వహించారు. బీజేపీ నాయకుడు సురేశ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మీపతి తదితరులు కూడా సంతాపాన్ని వ్యక్తం చేశారు.